సాక్షి
నిర్మల్
బుధవారం। 12। జూన్। 2024



గాలివాన బీభత్సం

కడెం, ఖానాపూర్ మండలాల్లో శనివారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. గాలుల ఉధృతికి చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. 10లో▸



టమాటా సాగుతో లాభాలు

ప్రస్తుత సీజన్‌లో టమాటా ధరలు భగ్గుమంటున్నాయి.. ఆ పంట సాగు చేసిన రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తుంది. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.5 /26.6

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉపరితల ఆవర్తనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలా చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ప్రజాపాలన కావాలి'



మున్సిపల్ చాంబర్స్ సమావేశానికి హాజరైన నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: అధికారుల పాలన వద్దని ప్రజాపాలనే కావాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో మున్సిపల్ చైర్మన్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పురపాలక సంఘం 2019 చట్టాన్ని సవరించి, సీఎం రేవంత్‌రెడ్డి పురపాలక సంఘాల వ్యవస్థను మరింత బలంగా తీర్చిదిద్ది, పట్టణాలను అభివృద్ధి పథంలో నడిపించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన 'పత్తిరెడ్డి'



ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను సత్కరిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ బిల్లులను వీలైనంత త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో నిధులు విడుదల చేయిస్తానని రాజయ్య హామీ ఇచ్చారని రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పత్తి సాగులో మెలకువలు పాటించాలి



రైతునేస్తం కార్యక్రమంలో ఏడీఏ వీణ, రైతులు

కుంటాల: పత్తి సాగులో రైతులు మెలకువలు పాటించాలని వరంగల్ పరిశోధనస్థానం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంత్ సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కుంటాల రైతు వేదికలో రైతులకు మంగళవారం సూచనలు అందించారు. పత్తి సాగుకు ఎర్ర, చెల్క, తేలికపాటి నేలలు అనుకూలమని తెలిపారు. ఎకరాకు 25 వేల మొక్కలు వచ్చే విధంగా విత్తుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని పద్మశ్రీ చింతల వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. పచ్చిరొట్ట, ఎరువులు, వానపాముల ద్వారా కంపోస్ట్ ఎరువులు తయారు చేసుకోవాలని తెలిపారు. కలియ దున్నడం, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మహబూబాబాద్ జిల్లాలో తొర్రూర్ మండలంలో వ్యవసాయ అధికారుల సస్పెన్షన్ కు నిరసనగా ఏఈవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి రైతునేస్తం కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో భైంసా ఏడీఏ వీణ, ఏవోలు సోమలింగారెడ్డి, రాంచందర్ నాయక్, వికార్ అహ్మద్, ఏఈవోలు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని గాజులపేటలో రైస్‌మిల్ వెనుక హనుమాన్ ఆలయం ఆవరణలోని రావి చెట్టును నరికి, హనుమాన్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు ఎస్పీ జానకీ షర్మిలను కోరారు. ఈమేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మెడిసెమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గిల్లి విజయ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, సుంకరి సాయి, హిందూవాహిని పట్టణ అధ్యక్షుడు మంద పవన్ తదితరులు పాల్గొన్నారు.

బడికి చలో..

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- బడిబాట పట్టనున్న చిన్నారులు
- పిల్లలు, తల్లిదండ్రులు ఇక బిజీబిజీ

జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,044(ప్రభుత్వ,ప్రైవేటు)
మొత్తం విద్యార్థుల సంఖ్య దాదాపు 1,14,000 (2023–24ప్రకారం)

నిర్మల్ ఖిల్లా: నెలన్నర సెలవుల తర్వాత పాఠశాలలు బుధవారం తెరుచుకోనున్నాయి. సెలవుల్లో ఆటపాటలతో గడిపిన చిన్నారులు.. ఇక బడిబాట పట్టనున్నారు. ఈమేరకు తల్లిదండ్రులు పిల్లలను మానసికంగా సిద్ధం చేశారు. పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు ఈమేరకు పిల్లలను సంసిద్ధులను చేయాల్సిన అవసరం ఉంది. స్కూల్ బుక్స్, యూనిఫామ్స్, లంచ్ బాక్స్ సిద్ధం చేసుకుంటున్నారు.



సర్కారు బడి ప్రాధాన్యతను తెలిపే కరపత్రాలు విడుదల చేస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

'బడిబాట' పట్టిన ఉపాధ్యాయులు...

ఇప్పటికే విద్యాశాఖ ఈనెల 6 నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రతీరోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విధులు నిర్వహించే ఊళ్లలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత, ఆంగ్ల మాధ్యమం చదువు ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థుల నమోదును చేపడుతున్నారు. ప్రభుత్వం కూడా పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది.

ఉత్సాహ పూరితంగా మాట్లాడాలి...



కొత్తగా పాఠశాలకు వచ్చే విద్యార్థులను, చిన్న పిల్లల ను ఉత్సాహపూరితంగా మాట్లాడేలా ప్రోత్సహించాలి. ఈ బాధ్యత ఉపాధ్యాయులదే. వారు మొట్టమొదట బడికి రావడానికి కాస్త భయపడుతూ ఉంటారు. వారిని బడికి వచ్చేలా ఆసక్తి కలిగించాలి. కొత్త కొత్త పుస్తకాలు ఆట వస్తువులు స్నేహితుల గురించి వారికి వివరించాలి. అలా క్రమక్రమంగా బడి అంటే భయం పోయి ఇష్టం ఏర్పడుతుంది. తొలి కొన్నాళ్ల పాఠాల బోధన కంటే ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో మమేకమయ్యేలా వారిని ఉత్సాహపరచాలి.

– మోత్కూరి రాంచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

ఆహ్లాదకర వాతావరణంలో పాఠశాల పరిసరాలు ఉండాలి..



ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపడుతున్నాం. అయితే తొలిసారిగా మొదటి తరగతిలో జాయిన్ అయ్యే విద్యార్థులకు ఆహ్లాదపూరిత వాతావరణం ఉపాధ్యాయులు కల్పించాలి. భయం, బెరుకు లేకుండా విద్యార్థులు రోజూ ఆసక్తిగా బడికి వచ్చేలా పిల్లల్ని సన్నద్ధం చేయాలి. పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటూ ఆటపాటలతో కూడిన అభ్యసనం ఉంటే విద్యార్థులు బడికి ఇష్టంగా వస్తారు.

– తొడిశెట్టి రవికాంత్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పాకపట్ల, నిర్మల్

సర్కారుబడిలో చదివి.. ఉన్నతంగా ఎదిగి..

నిర్మల్ ఖిల్లా : బడి ఓ మధుర జ్ఞాపకం. స్కూల్ డేస్.. ప్రతి ఒక్కరి జీవితంలో మరపురానివే. పదేళ్ల చదివే పాఠశాల విద్య ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఎంతో మందిని స్నేహితులను చేస్తుంది. జీవితానికి బాటలు పడేది ఇక్కడి నుంచే.. నేటి నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడుల్లో చదివి, ప్రస్తుతం ఉన్నతంగా ఎదిగిన జిల్లాకు చెందిన వ్యక్తులు, వారి స్కూల్ డేస్‌లలో తొలిరోజు గడిచిన అనుభవాలు, చిన్ననాటి జ్ఞాపకాలు, మిత్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రేరణ, మలుపు తిప్పిన సంఘటనలు 'సాక్షి'తో పంచుకున్నారు.

ప్రతీరోజు 8కి.మీ దూరం...



భైంసాటౌన్: ప్రతి ఒక్కరి బాల్యంలో మరుపురాని జ్ఞాపకాలు ఉంటాయి.. నాకూ పాఠశాల రోజులు ఇప్పటికీ గుర్తుకొస్తాయి. బాల్యంలో స్నేహితులతో గడిపిన రోజులు బాగుండేవి. మాది మహారాష్ట్రలోని జల్‌గాం గ్రామం. వ్యవసాయ కుటుంబం. నాన్న సుభాష్ పాటిల్‌కు ప్రజలకు సేవ చేసే కొలువు చేయాలన్న కోరిక ఉండేది. తాను ఉన్న పరిస్థితుల్లో సాధ్యం కాలేదని, అందుకే ప్రజలకు సేవ చేయాలంటే ఉన్నత చదువొక్కటే మార్గమని మమ్మల్ని బాగా చదివించారు. ఏడో తరగతి వరకు ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. నా చిన్నప్పుడు అమ్మ కల్పనే పాఠశాలలో దింపి వచ్చేది. 8 నుంచి 12వ తరగతి వరకు మా ఊరికి 8 కి.మీల దూరంలోని వరణ్‌గాంలో ప్రభుత్వ కళాశాలకు సైకిల్‌పై వెళ్లేవాడిని. చౌదరి గురువుగారు నాలో ప్రతిభ గుర్తించి ప్రోత్సహించేవారు. నాన్న కల నిజం చేయాలనే సంకల్పంతో సివిల్స్‌పై దృష్టి సారించి ఐపీఎస్ అయ్యాను. – కాంతిలాల్‌పాటిల్, ఏఎస్పీ, భైంసా

సర్కారు బడిలోనే చదివి డాక్టరునయ్యా..



చిన్నప్పటి నుంచి ప్రభుత్వ బడిలోనే చదివా.. నా మొత్తం చదువు ప్రస్తుత జిల్లా కేంద్రంలోని జుమేరాత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. ఇప్పటిలా ఆ రోజుల్లో కనీస వసతులు కూడా ఉండేవి కావు. అయినా ఉపాధ్యాయులు అంకితభావంతో పాఠాలు చెప్పేవారు, విద్యార్థులు భయభక్తుల్లో చదువుకునే వాళ్లం. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు. ఇంటర్మీడియట్ వరకు తెలుగు మీడియంలోనే చదివాను. ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో వైద్య విద్యను కూడా పూర్తి చేశాను. అప్పట్లో మాకు గాంధీచౌక్ ప్రాంతంలో డి.లక్ష్మణ్ సార్ ఇంగ్లిష్ ప్రత్యేక క్లాసులు తీసుకునేవారు. వీరితోపాటు మా పాఠశాలలో బోధించిన టి.నారాయణ, గోపాలరావు, లక్ష్మణచారి, నరసయ్య సార్ వంటి వారంతా మమ్మల్ని చాలా బాగా ప్రోత్సహించేవారు. మా తరగతిలో ఎప్పుడూ రెండవ స్థానంలో నిలిచేవాడిని. చదువు ద్వారానే ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా ఎదగలుగుతామని మా ఉపాధ్యాయులు చెప్పేవారు. ఇప్పటికీ పాఠశాల తొలి రోజు ఆ జ్ఞాపకాలు గుర్తొస్తే మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది.

– డాక్టర్ సి.వెంకటరావు, ప్రముఖ సీనియర్ వైద్యులు, నిర్మల్

తొలిరోజు ఉత్సాహంగా..



వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయంటేనే ఒక పండగ వాతావరణంలా ఉండేది. నేను ఖానాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివాను. ఇంటర్, డిగ్రీ నిర్మల్‌లోని ప్రభుత్వ కళాశాల్లోనే పూర్తిచేశాను. పాఠశాలల పునఃప్రారంభం నాటికి మిత్రులందరం కొత్తగా కుట్టించుకున్న ఖాకీ రంగు నిక్కరు, తెల్లచొక్కా యూనిఫాం వేసుకుని వెళ్లేవాళ్లం. కొత్త పుస్తకాలు కొనుక్కుని పుట్టలు వేసుకునే వాళ్లం. ఫౌంటెయిన్ పెన్‌లో ఇంకు నింపుకుని సిద్ధం చేసుకునే వారం. గోనె సంచుల బ్యాగులు భుజానికి వేసుకొని బడికి పరుగెత్తుకుని వెళ్లేవాళ్లం. సమీప గ్రామాల వారు సైకిళ్లపై బడికి వచ్చేవారు. కొత్త విద్యార్థులతో కొత్త స్నేహాలు చిగురించేవి. పై తరగతులకు వెళ్తున్నామన్న ఆనందం మదినిండా తొణికిసలాడేది. ఆహ్లాదకర వాతావరణంలో తొలిరోజు పరిచయ కార్యక్రమాలు, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు టైం టేబుల్ ఇచ్చేవారు. అప్పుడు అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే తెలుగు మీడియం చదివే వాళ్లం. మాపై అందరి ఉపాధ్యాయుల ప్రభావం ఉన్నా ప్రధానంగా డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసిన కలీం సార్ క్లాస్ అంటేనే బాగా ఇష్టపడేవారం. పెద్దయిన తర్వాత ఏ స్థాయిలో ఉన్నా 1960 ప్రాంతంలో మొదటి తరగతితో ప్రారంభమైన ప్రస్థానం, ఆనాటి తొలి రోజు జ్ఞాపకాలు మదిలో ఎప్పుడూ పదిలంగానే ఉంటాయి.

– డాక్టర్ సంపత్ కుమార్, ప్రముఖ సాహితీవేత్త, కెనడా రాయబార కార్యాలయ విశ్రాంత ఉద్యోగి, నిర్మల్

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ ప్రమోషన్లకు సంబంధించిన సీనియార్టీ జాబితాను అధికారులు సోమవారం రాత్రి విడుదల చేశారు. పండిత, పీఈటీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులకు సంబంధించిన జాబితాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యంతరాలను మంగళవారం ఆన్‌లైన్‌లో తీసుకున్నారు. అభ్యంతరాలు ఉన్నవారు డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సవరణ చేసిన తర్వాత మంగళవారం రాత్రి కూడా మరో జాబితాను విడుదల చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలి.



మాట్లాడుతున్న నాయకులు

సీనియారిటీ జాబితాను సవరించాలి

జిల్లాలో హిందీ, తెలుగు పండితులకు సంబంధించిన సీనియార్టీ జాబితాలో జరిగిన తప్పిదాలను సవరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ కోరారు. సాధారణంగా సీనియారిటీ ఒక ఉపాధ్యాయుడు విధుల్లో చేరినప్పటి నుంచి సదరు ఉపాధ్యాయుని సర్వీసు కాలాన్ని లెక్కిస్తారు, కానీ దానికి విరుద్ధంగా సీనియారిటీ జాబితాను జిల్లా అధికారులు రూపొందించారని ఆరోపించారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు సవరించిన జీవో 33 ప్రకారం 10% రిజర్వేషన్ కలుపుతూ ప్రమోషన్లు ఇవ్వాలని గతంలోనే ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. డీఈవో స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

నిర్మల్ రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ కోరారు. ఈమేరకు డీఈవో రవీందర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పుడు ధ్రువీకరణ, అక్రమాలకు పాల్పడే ఉపాధ్యాయులను గుర్తించి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పదోన్నతులు సక్రమంగా జరిగేలా తమ సంఘం ఉపాధ్యాయుల పక్షాన నిలబడుతుందని తెలిపారు. 727 స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్‌అసిస్టెంట్ పోస్టులను ప్రకటించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జూన్ 1వ తేదీ వరకు ఉన్న ఖాళీలన్నీ గుర్తించి భర్తీ చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నాగభూషణ్ పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థి 'ప్రైవేటు' బాట..!

- మెరుగైన విద్య కోసం ఇతర ప్రాంతాలకు..
- ఆర్థికంగా భారమైనా కార్పొరేట్ చదువులకే మొగ్గు

భైంసాటౌన్: జిల్లా నుంచి ఎక్కువమంది విద్యార్థులు ప్రైవేటు బాట పడుతున్నారు. కార్పొరేట్ చదువుల కోసం హైదరాబాద్, నిజామాబాద్, విజయవాడతోపాటు ఇతర పట్టణాలకు తరలిపోతున్నారు. ఏడో తరగతి వరకు స్థానికంగా చదివిన ఎంతోమంది విద్యార్థులు ఆపై తరగతుల చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. స్థానికంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో చదివితే భవిష్యత్తులో పోటీ పరీక్షలను తట్టుకోలేరనే ఉద్దేశంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఐఐటీలకు విపరీతమైన క్రేజ్ నేపథ్యంలో తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో ఆర్థికంగా భారమైనా కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే చేర్పిస్తున్నారు.

ఏడో తరగతి నుంచే...

విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైంది. ఇదివరకు చాలామంది తల్లిదండ్రులు పదో తరగతి వరకు స్థానికంగానే చదివించేవారు. కానీ, ఇటీవలి కాలంలో ఏడో తరగతి నుంచే హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఏడో తరగతి నుంచే ఐఐటీ, జేఈఈ పరీక్షల సిలబస్ బోధిస్తుండడంతో ఇంటర్ వరకు పూర్తిస్థాయిలో పోటీని తట్టుకుంటారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. స్థానికంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు లేవన్న భావనలో కార్పొరేట్ చదువులకే మొగ్గు చూపుతున్నారు. దీంతోపాటు పాఠశాల స్థాయి నుంచే రెసిడెన్షియల్ చదువులకు అలవాటు పడాలన్న ఉద్దేశంతోనూ హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో చదివిస్తున్నారు.

ఫలితాల మోజులో..

ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, జేఈఈ ర్యాంకుల మోజులో చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లోని పలు కార్పొరేట్ కళాశాలలు జిల్లాల వారీగా పీఆర్వోలను నియమించుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నాయి. అడ్మిషన్‌కు ఇంత కమిషన్ చొప్పున చెల్లిస్తూ ముందుగానే అడ్మిషన్ల పేరిట అడ్వాన్సులు తీసుకుంటున్నాయి. తమ కళాశాలల్లో విద్యార్థులు సాధించిన ర్యాంకులు, ఫలితాలను ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్లు చేయిస్తున్నాయి. దీంతో రూ.లక్షల్లో ఫీజులు చెల్లిస్తూ ఆర్థికంగా భారమైనా తల్లిదండ్రులు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. కానీ, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరూ ర్యాంకులు సాధిస్తున్నారా అన్నది తల్లిదండ్రులు గుర్తించాల్సిన అవసరముంది. ఒత్తిడి తట్టుకోలేక ఎంతోమంది విద్యార్థులు తిరుగుబాట పట్టిన సందర్భాలు ఉండగా, తల్లిదండ్రులకు చెప్పుకోలేక ఎంతోమంది ఆత్మహత్య కూడా చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- డంపింగ్‌యార్డు, మిషన్ భగీరథ నల్లాల ఆన్‌లైన్ నమోదు, పల్లె ప్రకృతివనాల పరిశీలన

సారంగాపూర్: రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అవలంబించి పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈసందర్భంగా రైతులతో కలిసి ఆయన వీడియోను తిలకించారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ రైతులు సస్యరక్షణ పద్ధతులు, ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో పంటలు సాగుచేయాలని సూచించారు. రసాయన ఎరువులు వినియోగించడం మానేసి సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేయాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొక్కల మధ్య పిచ్చిమొక్కలు ఉండడం గమనించిన ఆయన సిబ్బంది పనితీరు బాగాలేదన్నారు. వెంటనే మొక్కలను చక్కగా తరలించి సాయంత్రం వరకు ఫొటో పంపిపాలని తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ నల్లాల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఆన్‌లైన్ చేయడంలో సర్వర్ సమస్య తలెత్తడంతో ప్రక్రియలో ఆలస్యమవుతోందని సిబ్బంది కలెక్టర్‌కు సూచించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డులను పరిశీలించారు. డంపింగ్‌యార్డు వద్ద చెత్త నిర్వాహణ సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోనే నిర్వాహణ ఇలా ఉంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఏమిటని అధికారులను నిలదీశారు. వెంటనే చెత్త నిర్వహణపై దృష్టిసారించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఏవో రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రథాలగుడిని విభజించొద్దు

- శివ, కేశవులను వేరుచేయొద్దు..
- ఆలయ వంశపారంపర్య పురోహితులు

నిర్మల్: శివుడికి.. విష్ణువుకు తేడా లేదని, శైవులు, వైష్ణవులు ఒక్కటేనన్న భావనను విశ్వవ్యాప్తం చేయాలన్న లక్ష్యంతో ఆదిశంకరాచార్యులు అద్వైత సిద్ధాంతాన్ని సమాజంలోకి తీసుకువెళ్లారని, ఆ క్రమంలోనే నిర్మల్‌లోని బ్రహ్మపురి రథాలగుడిలో దశాబ్దాల క్రితం హరిహరదేవస్థానాలను నిర్మించారని ఆలయ ఆస్థాన పురోహితులు పేర్కొన్నారు. కొందరు సంఘాలు, ట్రస్టుల పేరిట ఇటీవల రథాలగుడిలో పురాతన కట్టడాలను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రాతిమెట్లతో ఉన్న భారీ పుష్కరిణి(కోనేరు)ను ఇప్పటికే పూడ్చివేశారని, ఆ స్థలంతోపాటు ఖాళీగా ఉన్న ఆలయ స్థలాన్ని కలుపుతూ కొత్త నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రథాలగుడిలో విశ్వేశ్వరాలయం, వేణుగోపాలస్వామి ఆలయం పక్కపక్కనే ఉండటం, శైవవైష్ణవ బేధం లేదని చూపడానికి దాదాపు 700 ఏళ్ల క్రితమే పెద్దలు ఆచరించి, అమలు చేశారని తెలిపారు. కొంతమంది తమ స్వార్థంతో రథాలగుడి ప్రాంగణంలోని ధర్మశాలను, ఖాళీస్థలాన్ని ఓ విద్యాసంస్థకు అద్దెకు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే సదరు విద్యాసంస్థ నిర్మాణాలకు అనుకూలంగా ఉండటానికి వేణుగోపాల, విశ్వేశ్వరాలయాల మధ్య గోడలు నిర్మించేందుకు ప్రయత్నించారని తెలిపారు. రథాలగుడి మొత్తం ఒక్కటేనని, ఇక్కడ ధర్మానికి విరుద్ధంగా విభజించే ప్రయత్నం ఏది చేసినా గుడి వంశీయులుగా తామంతా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఈ చర్యలను పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. నిర్మల్ ప్రజలు కూడా స్పందించి చారిత్రక ఆలయాలను కాపాడుకోవాల్సిన విషయాన్ని గుర్తించాలని వారు కోరారు. కబ్జాకు ప్రయత్నిస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో గుడి సోమనాథశర్మ సిద్ధాంతి, గుడి ఉమామహేశ్వరశర్మ సిద్ధాంతి, గాడిచర్ల నాగేశ్వరశర్మసిద్ధాంతి, గుడి రాజేశ్వరశర్మసిద్ధాంతి, గుడి చంద్రశేఖరశర్మ, గాడిచర్ల అనిరుధ్‌శర్మ, బ్రహ్మపురివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రథాలగుడి వంశీయులు

వంట కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నిర్మల్‌చైన్‌గేట్: వంట కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను, పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు అంతకు ముందు సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం వంట కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వంటపాత్రలు ఇవ్వాలన్నారు. వంట సరకులు, గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. వయస్సు పైబడిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వంట కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. వంట కార్మికులకు సంవత్సరానికి 2 జతల యూనిఫాం, రాగిజావా అల్పాహారం అందించినందుకు అదనపు వేతనం చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భూక్య రమేశ్, లక్ష్మణ్, మొనవ్వ, ఎనుగందల లక్ష్మి, హంస పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన వంట కార్మికులు

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న గ్రూప్ నిర్వాహకులు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన అనక సంతోష్, స్వప్న ఇటీవల పిడుగు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న అభిమన్యు వాట్సాప్ గ్రూప్ నిర్వాహకుడు మెస్రం శేఖర్ బాబు గ్రూప్ సభ్యులతో మంగళవారం గ్రామానికి వచ్చి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి, మృతుల కుటుంబ సభ్యుల కోసం విరాళంగా సేకరించిన రూ.1.27లక్షలు అందించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ.. రూ.1.11 లక్షలు తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని తెలిపారు. మిగతా డబ్బులు చిన్నారి పోషణ కోసం కుటుంబ సభ్యులకు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేస్లాపూర్ రాయిసెంటర్ సార్ మెడి మెస్రం వెంకట్‌రావ్, గ్రూప్ సభ్యులు తోడసం నాగోరావ్, మెస్రం నాగ్‌నాథ్, పెందోర్ దీపక్, ఉర్వేత రూప్‌దేవ్, మెస్రం లింగు, గ్రామ పెద్దలున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సాయమ్మ (ఫైల్)

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎలుగు సాయమ్మ (101) మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం మృతి చెందినట్లు ఆమె చిన్న కుమారుడు ప్రేమయ్య తెలిపాడు. సాయమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు, మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. పెద్ద కుమారుడు సైదు రెండునెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిడుగుపాటుకు ఆవు మృతి



పిడుగుపడి మృతి చెందిన ఆవు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొమ్ముగూడ గ్రామానికి చెందిన బామని స్వామికి చెందిన ఆవు మంగళవారం పిడుగు పాటుకు గురై మృతి చెందింది. స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామంలో ఈదురు గాలులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. ఇండ్లపై రేకులు లేచాయి. పలు చెట్లు నేలకొరగగా ఈ ప్రమాదంలో ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనకు పరిహారం అందేలా చూడాలని కోరాడు.

గోదావరి పుష్కరఘాట్ల వద్ద స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

బాసర: బాసరలోని పవిత్ర గోదావరినది పుష్కరఘాట్ల వద్ద మంగళవారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్‌కు చెందిన స్వచ్ఛంద సేవా నిర్వాహకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ పరిసరాలు, గోదావరినది వద్ద చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సుమారు 25 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పప్పుదినుసుల సాగుతో లాభాలు

- తొలకరి సమయంలో సాగు చేస్తే మేలు
- జిల్లాలో సాగుకు అనువైన నేలలు
- స్వల్పకాలంలో కోతకు వచ్చే అవకాశం
- మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



మంచిర్యాలఅగ్రికల్చర్: పప్పుధాన్యాల్లో ప్రధానంగా కంది, పెసర, మినుము జిల్లాలో సాగుకు అనుకూలమైన పంటలు. ఇందులో తక్కువ రోజుల్లో చేతికి వచ్చే పంటలు పెసర, మినుము. వీటి సాగుపై రైతులు అమిత ఆసక్తి చూపుతున్నారు. తొలకరి తర్వాత సాగు చేసుకుంటే ఈ పంటలు నేలను సారవంతం చేయడమే కాకుండా 60 నుంచి 75 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం పప్పుధాన్యాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఏ పప్పు ధర చూసినా రూ.100కు పైనే ఉంది. పప్పుధాన్యాల సాగుతో స్వల్పకాలంలో దిగుబడులు పొందడమే కాకుండా మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ వివరిస్తున్నారు. కొద్దిపాటి సలహాలు, సూచనలు పాటించి సాగు చేస్తే పసిడిసిరులు కురిపిస్తుందని చెబుతున్నారు.

అన్ని నేలలకు అనువైన 'పెసర'

పంట మార్పిడిలోనూ అంతరపంటగానూ పెసర అత్యంత అనువైనది. తక్కువ కాలంలో కోతకు వస్తుంది. ఆయకట్టు ప్రాంతాలు, చెరువులు, బోరు బావుల కింద రైతులు వరిసాగు చేసే భూముల్లోనూ ముందుగా పెసర వేసుకుని తర్వాత వరి నాటుకోవచ్చు. పెసర కోసిన తర్వాత పచ్చిరొట్ట ను భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. పెసర అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. చౌడునేలలు, నీరు నిలిచే భూములు మాత్రం పనికి రావు.

పెసరలో రకాలు

ఎల్‌జీ-407 పెసర రకం 70–75 రోజులకు చేతికి వస్తుంది. ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరిగి కాయలు మొక్క పైభాగాన కాస్తాయి. గింజలు మెరుస్తూ మధ్యస్థ లావుతో ఉంటాయి. ఎల్లోమొజాయిక్ తెగులు, నల్ల ఆకుమచ్చ తెగులను తట్టుకుంటుంది. ఎల్‌జీజీ-410 రకం 75 రోజుల పంట. దిగుబడి ఎకరాకు 5–6 క్వింటాళ్లు వస్తుంది. మొక్కలు నిటారుగా గుబురుగా పెరుగుతాయి. గింజలు పెద్దవిగా ఉండి మెరుస్తుంటాయి. ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్‌జీజీ-50 రకం 65 నుంచి 70 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు మధ్యస్థ ఎత్తులో ఉండి గుబురుగా కనిపిస్తాయి. పంట చేతికివచ్చే సమయంలో వర్షాలు కురిసినప్పటికీ గింజలు కొంతమేర చెడిపోవు. పూసా-105 రకం 65–70 రోజుల పంట. దిగుబడి 4–6 క్వింటాళ్లు వస్తుంది. అన్ని ప్రాంతాలకు అనువైనది. కాయలు మొత్తం మొక్క పైభాగంలోనే ఉండి అన్నీ ఒకేసారి కోతకు వస్తాయి. పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులును కొంతమేర తట్టుకుంటుంది. ఎంజీజీ-295 రకం 65–70 రోజుల పంట. ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరుగుతాయి. నల్లమచ్చ తెగులను తట్టుకుంటుంది. గింజ మధ్యస్థ లావుగా ఉండి మెరుస్తూ ఉంటుంది. ఎంజీజీ-347 రకం పంటకాలం 65–70 రోజులు. ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. మధ్యస్థ రకం. మొక్కలు నిటారుగా.. గుబురుగా పెరుగుతాయి. కాయలు మొక్క పైభాగాన కాసి ఒకేసారి కోతకు వస్తాయి. ఆకుమచ్చ తెగులు, ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. డబ్ల్యూజీజీ-37 రకం 60 నుంచి 65 రోజుల పంట. గింజలు ఆకర్షణీయంగా, పచ్చగా నిగనిగలాడుతుంటాయి. అన్ని నేలల్లో సాగు చేసుకోవచ్చు. పంటంతా ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎల్‌జీజీ-460 రకం 60–65 రోజుల పంట. ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. కాయలు గుత్తులుగుత్తులుగా ఉండి కోయడానికి సులభంగా ఉంటుంది. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. ఎంఎల్-267 రకం 65 రోజుల పంట. 4–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్క నిటారుగా ఉండి, కింది నుంచి పైదాకా కాస్తుంది.

మినుము

పొగాకు సాగు చేసే నల్లరేగడి భూముల్లో తొలకరి వర్షాలకు పంట మార్పిడి పంటగా మినుము సాగు చేసుకోవచ్చు. పెసర, మినుమును పంట మార్పిడి పంటగా, అంతరపంటగా సాగుచేసుకోవచ్చు. పెసర, మినుము మొక్కలు గాలిలోని నత్రజనిని రైజోబియం బ్యాక్టీరియా సహాయంతో స్థిరీకరించి పంట ఎదుగుదలకు ఉపయోగపడడమే కాకుండా ఎకరానికి సుమారు 20 కిలోల వరకు నత్రజనిని నేలకు అందిస్తాయి. మినుము పంట నీటి ఎద్దడిని తట్టుకోలేదు. తేమను నిలుపుకోలేని తేలికపాటి భూములు, ఎర్రనేలలు మినుము సాగుకు పనికి రావు. పల్లాకు ఆకుముడత వైరస్ తెగుళ్లు తొలకరిలో ఎక్కువగా ఆశిస్తాయి.

మినుములో రకాలు

ఎల్‌బీజీ-20 అన్ని కాలాలకు అనువైన రకం. ఆకులు సన్నగా, పొడవుగా ముదురుగాకుపచ్చ రంగులో ఉంటాయి. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. గింజలు నల్లగా మెరుస్తుంటాయి. 70–75 రోజుల పంట కాలంలో ఎకరానికి 5–6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. డబ్ల్యూబీజీ-26 రకం మొక్కలు గుబురుగా పొట్టిగా ఉంటాయి. గింజలు సాదాగా ఉంటాయి. అన్ని కాలాలకు అనువైన రకం. పల్లాకు తెగులును కొంతమేర తట్టుకుంటుంది. పంటకాలం 70–75 రోజులు. ఎకరానికి 4–5 క్వింటాళ్ల దిగబడి వస్తుంది. టీ-9 అన్ని కాలాలకు అనువైన రకం. మొక్కలు గుబురుగా, పొట్టిగా ఉంటాయి. ఆకులు సన్నగా ముదురాకు పచ్చరంగులో ఉంటాయి. పంట కాలం 70–75 రోజులు. 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ ప్రాంతం ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఖానాపూర్‌కు చెందిన షేక్ సలీమ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. దీంట్లో ఇంట్లోని గృహోపకరణాలు, ఫ్రిజ్, టీవీ, కూలర్, దుస్తులతో పాటు ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు పేర్కొన్నాడు.

విద్యుత్‌షాక్‌తో గొర్రె మృతి



మృతి చెందిన గొర్రె

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి చెందింది. గ్రామ శివారులోని సెల్ టవర్ సమీపంలో విద్యుత్ స్తంభం ఎర్త్‌వైర్‌కు తగిలి పశుగ్రాసం కోసం వెళ్లిన గొర్రె షాక్ గురై మృతి చెందింది. మృతి చెందిన గొర్రె విలువ రూ.11 వేల వరకు ఉంటుందని యజమాని పొచ్చన్న ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆత్రం భాస్కర్‌ను అభినందించిన సీఎం



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న భాస్కర్

నేరడిగొండ: కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకుడు ఆత్రం భాస్కర్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ రావడంపై భాస్కర్‌ను సీఎం అభినందించారు. పార్లమెంట్ స్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ ముందుకుసాగాలని సూచించినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ తదితరులున్నారు.

గజ్జల రాజుల్ దేవతకు విత్తనపూజలు



పూజలు చేస్తున్న వాల్గొండ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని మారుమూల గ్రామాల ఆదివాసీలు మంగళవారం వడగామ్ అటవీ ప్రాంతంలోగల గజ్జల రాజుల్ దేవతకు విత్తన పూజలను ఘనంగా నిర్వహించారు. వానాకాలం సీజన్‌లో విత్తనాలు నాటడం ప్రారంభించారు. మండలంలోని వాల్గొండ, పొల్లుగూడ ఆదివాసీలు గజ్జల రాజుల్ దేవత వద్ద ప్రత్యేకపూజలు చేశారు. విత్తనాలతో కూడిన నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, సాగు చేసిన పంటలు బాగా పండాలని, అడవి జంతువుల నుంచి పంటలను రక్షించాలని మొక్కినట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు కినక లచ్చుపటేల్, మెస్రం సోమేశ్వర్, పెందోర్ దేవ్‌రావ్, దుర్వ గణపతి, ఆత్రం శేకు తదితరులున్నారు.

కల్లు అమ్మకం గొడవలో ఐదుగురిపై కేసు

తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలో కల్లు అమ్మకం విషయంలో సోమవారం గ్రామకమిటీ సభ్యులు, కల్లు విక్రయదారుడి మధ్య గొడవ జరిగింది. కల్తీ కల్లు అమ్ముతున్నాడని సోమవారం గ్రామస్తులు ఆరోపిస్తూ దుకాణం నిర్వాహకుడు సాయినాథ్‌తో వాగ్వాదానికి దిగారు. కాగా, కొందరు గ్రామ కమిటీ సభ్యులు తన కుటుంబాన్ని దూషించి దాడిచేశారని సాయినాథ్‌గౌడ్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గ్రామ కమిటీ సభ్యులు స్పందిస్తూ.. గతంలో గ్రామంలో కల్తీకల్లు అమ్మవద్దని గ్రామసభలో చేసిన తీర్మానాన్ని పట్టించుకోకుండా సాయినాథ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కాగా, సాయినాథ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు వీడీసీకి చెందిన ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

కల్తీ కల్లు అమ్ముతున్నట్లు ఫిర్యాదు

భైంసాటౌన్: తమ గ్రామంలో కల్తీ కల్లు అమ్ముతున్నట్లు తానూర్ మండలం మహలింగి గ్రామస్తులు మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సీఐ నజీర్‌హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో కల్లు తీసే చెట్లు తక్కువగా ఉండగా, కల్లును కల్తీ చేసి విక్రయిస్తుండడంతో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. కల్తీ కల్లు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


నాలుగు సెల్‌ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్లతో బాధితులు

ఎదులాపురం: పట్టణ వన్‌టౌన్ పోలీసులు నాలుగు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం గిమ్మకు చెందిన జార ప్రశాంత్ రైతు బజార్‌లో, పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన చిల్కూరి సాయి తేజ అశోక్‌రోడ్‌లో నాలుగు నెలల క్రితం తమ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. అలాగే పొన్నారికి చెందిన వడ్డి రాజశేఖర్ వినాయక్ చౌక్‌లో తొమ్మిది నెలల క్రితం, నేరడిగొండ బుగ్గారానికి చెందిన పవార్ రవీందర్ స్థానిక ద్వారకానగర్‌లో మూడు నెలల క్రితం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి మంగళవారం బాధితులకు అందించారు. ఐటీకోర్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, హన్మంతు ఉన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠినచర్యలు



మాట్లాడుతున్న సీఐ భీమేశ్

నేరడిగొండ: గంజాయి సాగు చేస్తే కఠినచర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేశ్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్‌లోని కాగజ్‌గూడ కమాన్‌కు చెందిన పాపిశెట్టి సంతోష్‌కుమార్ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. గంజాయిని ఇంద్రవెల్లి మండలం ధర్మసాగర్ గ్రామానికి చెందిన సాబ్లే జైతురాం, అమర్‌సింగ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలుపడంతో వారినీ అధీనంలోకి తీసుకున్నారు. పట్టుకున్న గంజాయి 6కిలోల 600 గ్రాములు ఉంది. దీని విలువ సుమారు రూ.1.65లక్షలు ఉంటుంది. కాగా, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. రైతులు గంజాయి సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని, రైతుబంధు రాదని హెచ్చరించారు. గంజాయి సాగు చేసినా, తరలించినా సమాచారం ఇస్తే పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

గాలివాన బీభత్సం



ఉట్నూర్‌రూరల్: కొలాంగూడ సమీపంలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు



కడెం: రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్లను తొలగిస్తున్న పోలీస్, అటవీశాఖల సిబ్బంది



ఖానాపూర్: లేచిన ఇంటి పైకప్పు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంటపాటు ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఆదిలాబాద్–మంచిర్యాల ప్రధాన రహదారిపై ఇరువైపులా పాత ఉట్నూర్, నాగాపూర్, కొలాంగూడ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. రహదారికి అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. మారుమూల గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచి పోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

కడెం మండలంలో..

కడెం: మండలంలోని లక్ష్మీపూర్ సమీపంలో భారీ ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగాయి. భారీ వృక్షాలు విరిగిపడడంతో నిర్మల్– మంచిర్యాల రహదారిపై రాకపోకలకు అంతరాయమేర్పడింది. పోలీస్ సిబ్బంది నర్సయ్య, వెంకటేశ్, బీట్ అధికారి అలీం అక్కడికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను ట్రాక్టర్ సాయంతో తొలగించారు. రాకపోకలు నిలిచిపోవడంతో పలువురు వాహనదారులు కలమడుగు, దస్తురాబాద్ మీదుగా కడెం వెళ్లారు. కల్లెడ, లక్ష్మీపూర్, నవాబ్‌పేట్ గ్రామాల్లో రేకులు ఎగిరిపడ్డాయి. 13 విద్యుత్ స్తంభాలు విరిగి కరెంట్ సరఫరా నిలిచింది. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన గోదూరి నరేశ్ ఇంటి పైకప్పు దూలంతో సహా ఎగిరిపోయింది. ఈ సమయంలో గోడ ఇటుకలు మీద పడి కుటుంబసభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఖానాపూర్: అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధి జిల్లెడికుంట గ్రామానికి చెందిన తోడసం హీరామాన్ (60) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన హీరామాన్ మద్యం మత్తులో మంగళవారం గ్రామంలోని పంటచేనులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. హీరామన్‌కు భార్య అంజలిబాయి, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం రైలు ఢీకొని జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడకు చెందిన అమృత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రైలు పట్టాలు దాటే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఆయన ఎడమకాలు తొడ వద్ద నుంచి పూర్తిగా తెగింది. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా, సిబ్బంది రేఖ, విఠల్ గౌడ్ క్షతగాత్రుడిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

చిరుత సంచారం

బోథ్: మండలంలోని జీడిపల్లి, టీవీటీ గ్రామాల మధ్య చిరుత సంచారం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తికి చిరుత కనిపించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, చిన్నపిల్లలు, వృద్ధులు రాత్రి వేళ అటుగా వెళ్లకూడదని ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు. బోథ్ మండల పరిధిలో చిరుతల సంచారం పెరిగినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర నుంచి మండలానికి చిరుతలు వస్తూపోతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

చదువుల తల్లికి లక్ష పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న ఆలయ వైదిక బృందం

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి క్షేత్రంలో ఆశ్లేష నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ వైదిక బృందం వేదమంత్రోచ్చారణల మధ్య త్రిగునాత్మిక స్వరూపిణి (సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి)ముగ్గురమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీమాధవానంద సరస్వతిస్వామికి అర్చకులు, ఈవో విజయరామారావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి పూజలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. శ్రీమాధవనంద సరస్వతిస్వామికి ఆలయ అర్చకుడు శ్రౌతి సునీత రాజేశ్వరశర్మ దంపతులు పాదపూజ నిర్వహించారు.

సమస్యల ఒడిలో 'అమ్మ ఆదర్శ బడి'



ప్రభుత్వ బాయ్స్ పాఠశాలలో అసంపూర్తి నిర్మాణం

విద్యాశాఖ ఆధ్వర్యంలో 'బడిబాట' నిర్వహిస్తున్నా జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. జిమెరాపేట్ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు. సోమార్‌పేట్ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ముందుకుసాగడం లేదు. నేడు పాఠశాలలు పునఃప్రారంభిస్తున్నందున విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



జిమెరాపేట్ పాఠశాలలో చెత్తాచెదారంతో తరగతి గది



సోమార్‌పేట్ పాఠశాలలో అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

మళ్లీ ఒంటికి.. రెంటికీ కష్టాలె





బుధవారం నుంచి బడులు పునఃప్రారంభం కానుండగా విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నంబర్ 1 పాఠశాలలో మరుగుదొడ్లు వినియోగంలో లేవు. నూతనంగా చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తి దశలో ఉంది. కనీసం నీటి సౌకర్యం లేదు. దీంతో మళ్లీ విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్